క్లుప్తంగా

ఖోఖో టోర్నమెంట్‌కు సూరిబాబు ఎంపిక



సూరిబాబును అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పారావు, తదితరులు

విజయనగరం టౌన్: తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీలో ఈ నెల 26 నుంచి జనవరి ఒకటో తేదీ వరకు జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో టోర్నమెంట్‌లో ఆంధ్రా యూనివర్సిటీ టీమ్‌కు పూల్‌బాగ్ కాలనీ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి కడియం సూరిబాబు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.అప్పారావు, పీఈటీ టి.సత్యప్రసాద్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎమ్ కృష్ణ, పీడీ జైనాబీలు విద్యార్థిని సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మంజుల పారుపూడి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలికి మెమో..

విజయనగరం అర్బన్: మండలంలోని రీమాపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళాదేవికి డీఈఓ యు.మాణిక్యంనాయుడు మెమో అందజేశారు. పాఠశాలను సోమవారం ఆయన అకస్మాత్తుగా సందర్శించారు. ఈ సందర్భంగా హాజరుపట్టికను పరిశీలించగా.. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గత శుక్రవారం ఆమె విధులకు గైర్హాజరైనట్లు గుర్తించి చార్జ్ మెమో జారీ చేశారు.

నీటిని బయటకు పంపించాలి..



భోగాపురం సమీపంలో రైతుతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ ఏడీఏ నాగభూషణ్, తదితరులు

భోగాపురం: వర్షాలకు పొలాల్లో నిలిచిపోయిన నీటిని బయటకు పంపించాలని వ్యవసాయశాఖ రూరల్ ఏడీఏ ఎ.నాగభూషణ్ అన్నారు. వర్షాలకు పాడైన పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తడిచిన వరి పనలపై ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. మండలంలో 25 ఎకరాల్లో వరి పనలు తడిచిపోగా... మరో 45 ఎకరాల్లో వరి పంట పూర్తిగా పోయిందని ఏఓ హరికృష్ణ ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలనలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


వడ్డీలేని రుణాలివ్వాలి..

విజయనగరం అర్బన్: ప్రతి నెలా క్రమం తప్పకుండా ఎస్ఎల్ఎఫ్, పొదుపు సంఘాలలో దాచుకుంటున్న సొమ్మును సభ్యులకు వడ్డీలేని రుణాలుగా ఇవ్వాలని 30 పొదుపు సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. ఆ సొమ్మును సభ్యులకు పంచకుండా బూర్లిపేటకు చెందిన గాయత్రీదేవి అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల సభ్యులు మాట్లాడుతూ.. పదిహేనేళ్లుగా ఎస్ఎల్ఎఫ్‌లో సభ్యులు దాచుకున్న నిధులు రూ. 21 లక్షల వరకు ఉన్నాయన్నారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు అందజేశారు.

మాదకద్రవ్యాల వినియోగంతో జీవితం నాశనం

డెంకాడ: మాదకద్రవ్యాల వినియోగంతో జీవితం నాశమవుతుందని ఎస్సై ఎ.సన్యాసినాయుడు అన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా మండలంలోని చింతలవలస, తదితర గ్రామాల్లో సంకల్పం పేరిట పోలీసులు సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవితం ఎంతో విలువైనదన్నారు. మత్తుతో జీవితాలను చిత్తు చేసుకోవద్దని సూచించారు.

భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్



హెచ్‌ఎం వెంకటేష్ ఆధ్వర్యంలో గణిత ప్రాజెక్ట్‌లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

భోగాపురం: భారతదేశ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని కొంగవానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆళ్ల వెంకటేష్ అన్నారు. పాఠశాల ఆవరణలో సోమవారం గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. శ్రీనివాస రామానుజన్ తన అద్భుత మేధాశక్తితో గణిత శాస్త్రంలో ఎన్నో సిద్ధాంతాలు, సూత్రాలు కనుగొని భారతదేశానికి ఎంతో పేరు తీసుకువచ్చారన్నారు. అతను గణితశాస్త్రానికి చేసిన కృషికి గుర్తింపుగా ప్రతి సంవత్సరం అతని జన్మదినాన్ని జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకుంటున్నామని చెప్పారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన గణిత క్విజ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పబ్బిరెండి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి కుదేలు..

- నాయకుల మధ్య తారాస్థాయికి చేరుకున్న ఆధిపత్య పోరు
- జనసేన, టీడీపీ నుంచి ఆ పార్టీల్లోకే చేరికలు
- వైఎస్సార్‌సీపీ నుంచి చేరుతున్నారంటూ అసత్య ప్రచారం
- ఇరుపార్టీల చేరికల రాజకీయంతో నవ్వుకుంటున్న ప్రజలు
- అసత్య ప్రచారాలను ఖండించిన వైఎస్సార్‌సీపీ నేతలు

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల నియోజకవర్గంలో కూటమిలో ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరుకుంది. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన అభివృద్ధి పనులను తమ పార్టీ కేడర్‌కు కేటాయించలేదంటూ గతంలో రచ్చకెక్కిన టీడీపీ నేతలు... ఎమ్మెల్యే తీరును బహిరంగంగానే ఎండగట్టారు. నెల్లిమర్ల మండల కేంద్రంలో నియోజకవర్గ స్థాయిలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి మరీ ఎమ్మెల్యే లోకం నాగమాధవిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. టీడీపీ, జనసేన మధ్య వార్ అధిష్ఠానం దృష్టికి చేరడంతో ఇరు పార్టీలకు చెందిన కీలక నేతలను అమరావతికి పిలిపించి రాజీ కుదిర్చేందుకు ప్రయత్నించినప్పటికీ చర్చలు కొలిక్కి రాలేదు. కొద్ది రోజుల కిందట టీడీపీ జిల్లా అధ్యక్షుడి సమక్షంలో అంతా కలిసికట్టుగా ఉంటామని ప్రకటించినప్పటికీ, సమావేశం అనంతరం కూడా మార్పు రాలేదని ఇరు పార్టీలకు చెందిన నాయకులు బహిరంగంగానే చెబుతున్నారు. బయటకి ఒకలా..లోలోపల మరోలా ఉంటున్నారని సొంత పార్టీ నేతలే చెప్పడం గమనార్హం. ఇదిలా ఉండగా.. తాజాగా టీడీపీ, జనసేన పార్టీలు చేరికల రాజకీయాన్ని మొదలుపెట్టాయి. టీడీపీ నుంచి జనసేన.. జనసేన నుంచి టీడీపీలోకి చేరికలను ప్రోత్సహిస్తూ..వైఎస్సార్‌సీపీ నుంచి చేరికలు జరుగుతున్నాయంటూ అసత్య ప్రచారాలు చేసుకోవడం విడ్డూరం.

ఒకేరోజు పోటాపోటీగా ఇరు పార్టీల్లో చేరికలు..

టీడీపీ, జనసేన చేరికల రాజకీయానికి నెల్లిమర్ల మండలాన్ని వేదికగా మార్చుకున్నారు. శనివారం నాడు ఒకే రోజు ఇరు పార్టీల్లో చేరికల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉదయం పూతికపేటలో పలువురు జనసేన నాయకులను టీడీపీలోకి చేర్చుకోగా.. సాయంత్రం పెద్ద బూరాడపేటలో పలువురు టీడీపీ కుటుంబాలను జనసేనలో చేర్చుకున్నారు. ఇరు పార్టీల్లోనే చేరికలను కొనసాగిస్తూ వైఎస్సార్‌సీపీ నుంచి చేరికలు జరగాయంటూ అసత్య ప్రచారాలు చేసుకోవడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడుతున్నారు. ఇరు పార్టీలు పొత్తులో ఉండడంతోనే వైఎస్సార్‌సీపీ నుంచి చేరికలంటూ అసత్య ప్రచారాలు చేసుకుంటున్నారని, నిజం ఎక్కువ కాలం దాగదంటూ విమర్శిస్తున్నారు. ప్రజా సమస్యలపై కార్యక్రమాలు మానేసి ఇవేమి చౌకబారు రాజకీయాలంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పొత్తులో ఉన్నప్పటికీ రెండు పార్టీల మధ్య చేరికలు ప్రోత్సహించడాన్ని చూసి జనం కూడా నవ్వుకుంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెద్ద బూరాడపేట సర్పంచ్ మక్కువ తవుడమ్మ

టీడీపీ కుటుంబాలే జనసేనలో చేరాయి

- బూరాడపేట వైఎస్సార్‌సీపీ నేతలు

తమ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలో చేరారని బోగస్ ప్రచారాలు చేసుకుంటున్నారని పెద్ద బూరాడపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సర్పంచ్ మక్కువ తవుడమ్మ మాట్లాడుతూ... గ్రామంలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్టును తమకి కేటాయించాలని కొంత మంది టీడీపీ నాయకులు ఇటీవల ఎమ్మెల్యే వద్దకు వెళ్లారన్నారు. జనసేనలో చేరితే డీలర్ పోస్ట్ కేటాయిస్తానని సంకేతాలు రావడంతో టీడీపీ నుంచి ఆ పార్టీలో చేరారని ఆమె ఆరోపించారు. అసత్య ప్రచారాలు మానుకోవాలని ఆమె హితవు పలికారు. తమ గ్రామంలో వైఎస్సార్‌సీపీని ఎవ్వరూ వీడలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తాజాగా అదే మహిళకు కండువా వేస్తున్న టీడీపీ నాయకులు

పైన పక్కన ఉన్న రెండు ఫొటోల్లో వృత్తాకారంలో కనిపిస్తున్న మహిళను చూశారా..? ఎన్నికల ముందు పూతికపేట గ్రామంలో జరిగిన కూటమి అభ్యర్థి ఎన్నికల ప్రచార కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతల మధ్య కూర్చున్న జనసేన కార్యకర్త. తాజాగా టీడీపీ నాయకులు మళ్లీ ఆమెకే టీడీపీ కండువా కప్పారు. ఈ మహిళ ఎన్నికల ముందు జనసేన పార్టీ తరఫున ప్రచారంలో పాల్గొన్నారని ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ నేత లెంక గోవింద తెలిపారు. ఆమెతో పాటు టీడీపీలో చేరిన వారందరూ జనసేన నుంచే చేరారని, వైఎస్సార్‌సీపీ నుంచి ఏ ఒక్కరు కూడా పార్టీ మారలేదని స్పష్టం చేశారు.



కూటమి అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో మొదటి వరుసలో మహిళ (ఫైల్)

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

- అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు

విజయనగరం: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు, తదితరులు వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలు తెలియజేసిన సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. కార్పొరేషన్ పరిధిలో తొలగించిన బ్యానర్లు, ఫ్లెక్సీలు, కర్రలకు సంబంధించి కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీఆర్‌ఓ సింహాచలం, మేనేజర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

న్యాయం చేయండి..



ఎస్సై దుర్గాప్రసాద్‌కు సమస్య వివరిస్తున్న పాత కొప్పెర్ల గ్రామస్తులు

పూసపాటిరేగ: మండలంలోని పాతకొప్పెర్ల ఎస్సీ కాలనీకి చెందిన కొంతమంది తమకు న్యాయం చేయాలని ఎస్సై దుర్గాప్రసాద్‌ను సోమవారం సంప్రదించారు. వివరాల్లోకి వెళితే.. ఎంతోకాలంగా ఉన్న విద్యుత్ బకాయిలను ఒకేసారి చెల్లించాలని విద్యుత్‌శాఖాధికారులు ఒత్తిడి చేస్తున్నారని, లేనిపక్షంలో కనెక్షన్ కట్ చేస్తామంటున్నారని బాధితులు ఎస్సై దృష్టికి తీసుకువచ్చారు. బకాయిలు విడతలవారీగా చెల్లిస్తామని చెప్పినా అధికారులు ఒప్పుకోవడం లేదన్నారు. దీంతో ఎస్సై ఐ. దుర్గాప్రసాద్ విద్యుత్‌శాఖ ఏఈ దేముడు సమక్షంలో బాధితులతో చర్చించారు. వాయిదాల పద్ధతిలో బిల్లులు తీసుకునేందుకు విద్యుత్ శాఖాధికారులు ఒప్పుకోవడంతో సమస్య సద్దుమణిగింది. కార్యక్రమంలో మన్యాల నరసింగరావు, గండవరపు నారాయణప్పడు, సామంతుల సూరి, సామంతుల అప్పలనర్సమ్మ, సామంతుల రమణమూర్తి, కింతాడ పైడయ్య, బట్టాన పైడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్సై చంద్రమోహన్, సిబ్బంది

భోగాపురం: మండలంలోని రెడ్డికంచేరు పంచాయతీ పరిధిలోని నిర్మించిన చెత్త సంపద కేంద్రం నిర్వహణను అధికారులు పట్టించుకోపోవడంతో రాత్రి వేళల్లో మందుబాబులు మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. దీనిపై 'మందుబాబులకు అడ్డాగా..' అనే శీర్షికన సాక్షిలో సోమవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్సై వై. చంద్రమోహన్ స్పందించి సిబ్బందితో కలిసి చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా వ్యక్తులు బహిరంగ ప్రదేశాల్లో కాని ప్రభుత్వానికి సంబంధించిన (పాఠశాలలు, దేవాలయాలు) భవనాల్లో కాని మద్యం తాగితే చర్యలు తప్పవన్నారు. ఈ పరిశీలనలో హెడ్ కానిస్టేబుళ్లు పి. సత్యనారాయణ, బి. రామారావు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి

విజయనగరం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజయనగరం కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి సూచించారు. సోమవారం నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వర్షపునీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలన్నారు. అలాగే పారిశుధ్య పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, రవిశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

భోగాపురం: వైద్యులు సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. సుందరపేట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో ఆస్పత్రి చైర్మన్ ఎమ్మెల్యే లోకం నాగమాధవి అధ్యక్షతన ప్రధాన వైద్యాధికారి వెంకటేష్‌ఆధ్వర్యంలో అస్పత్రి అభివృద్ధి సంఘ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వెంకటేష్ ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను వివరించారు. ఆస్పత్రి అభివృద్ధి నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో రోగులకు సరైన సౌకర్యాలు అందించలేకపోతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. నిధుల మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. కార్యక్రమంలో మిరాకిల్ సీఈఓ లోకం ప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కామేశ్వరరావు, అభివృద్ధి కమిటీ సభ్యులు బొల్లు త్రినాథ్, కె రాధాకృష్ణరెడ్డి, ఇప్పిలి అప్పలకొండ, పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓ ఎస్. కనకరాజు, వైద్యులు శాలిని, అలేఖ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

విజయనగరం అర్బన్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు సూచనలను పరిగణనలోకి తీసుకునేందుకు మంగళవారం 'డయల్ యువర్ సీఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక ఆర్టీసీ డీఎం జె. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదు గంటల నుంచి ఆరు వరకు ఈ కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. ప్రయాణికులు 99592 25620 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని కోరారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

విజయనగరం రూరల్: భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవడానికి రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహసీల్దార్ కూర్మనాథ్ అన్నారు. మండలంలోని జొన్నవలసలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలు, సరిహద్దులు, ఇళ్ల పట్టాలు, రేషన్‌కార్డులకు సంబంధించిన సమస్యలపై అర్జీలు సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్క ఫిర్యాదూ రాలేదు..

విజయనగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి స్పందన కరువవుతోంది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ తిరుపతినాయుడు ఆధ్వర్యంలో అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించినా, ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



వెంకటేష్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఐటీబీపీ జవాన్లు

విజయనగరం క్రైమ్: తమతో పాటు పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన తోటి జవాన్ కుటుంబానికి సహచర జవాన్లు ఆర్థిక సాయం అందజేశారు. దాసన్నపేటకు చెందిన దువ్వ వెంకటేష్ ఐటీబీపీ 41 బెటాలియన్ భువనేశ్వర్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 13న మృతి చెందాడు. మృతుడికి భార్య, బాబు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఐటీబీపీ తెలుగు జవాన్లు సోమవారం ఆయన స్వగృహానికి వచ్చి రూ. 82 వేలు అతని కుటుంబ సభ్యులకు అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో ఎస్సై కృష్ణమూర్తి, ఐటీబీపీ జవాన్లు ఉరిటి పైడినాయుడు, ఎ.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం..



డెంకాడ మండలంలోని పలు గ్రామాల్లో త్రైతసిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం నిర్వహించారు. మార్గశిర మాసాన్ని పురస్కరించుకుని త్రైతసిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయనగరం కమిటీ ఆధ్వర్యంలో భక్తులు ప్రచారం చేపట్టారు. మండలంలోని అక్కివరం, రఘుమండ, పినతాడివాడ, వెదుళ్లవలస, గొడిపాలెం గ్రామాల్లో ప్రచారం సాగింది. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు శంకరరావు, ప్రసాద్, నాయుడు, వంశీ, తదితరులు పాల్గొన్నారు. – డెంకాడ

పరిశీలన..



డెంకాడ మండలం జొన్నాడలో గల పోలింగ్ కేంద్రాన్ని రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకుడు ఎంవీ శేషగిరిబాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ పని చేస్తున్న బీఎల్‌ఓ విధి విధానాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపుల దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఓ నూకరాజు, ఆర్‌డీఓ కీర్తి, తహసీల్దార్ పద్మావతి, ఎన్నికల డీటీ జగన్నాథరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. – డెంకాడ

సన్మార్గంలో నడిపించేది మతం..

- మంత్రి కొండల్లి శ్రీనివాస్
- కలెక్టరేట్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



కేక్ కటింగ్ చేస్తున్న మంత్రి కొండపల్లి, కలెక్టర్ అంబేడ్కర్, ఎంపీ అప్పలనాయుడు

విజయనగరం అర్బన్: మానవాళిని సన్మార్గంలో నడిపించడానికే మతాలు పుట్టాయని ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ హైటీ పేరిట జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. మతం మనిషికి మంచి చెడులను ఉద్బోధిస్తుందన్నారు. నాగరికత రోజురోజుకీ అభివృద్ధి చెందుతోందని.. భవిష్యత్‌లో మరింత మెరుగుపడాలని ఆకాంక్షించారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ.. శాంతి, ప్రేమ, కరుణలకు ఏసు ప్రభువు ప్రతిరూపమన్నారు. ప్రతి మతాన్నీ, సంస్కృతి, ఆచారాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని.. ఈ నేపథ్యంలోనే క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాస్టర్ ప్రభాకర్ క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. కేక్ కటింగ్ అనంతరం అతిథులకు జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జేసీ ఎస్.సేతుమాధవన్, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఆర్ఎస్ జాన్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, పాస్టర్, క్రైస్తవ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం

విజయనగరం క్రైమ్: ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగమిప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకున్న సంఘటనపై బాధితుడు సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాడు. అధికారుల సూచనల మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై అశోక్‌కుమార్ తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. బెంగుళూరులోని ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న కింతాడ మోహన్ అనే వ్యక్తి ధర్మపురికి చెందిన రెడ్డి నారాయణరావు కుమారుడికి ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నాలుగు లక్షల రూపాయలు తీసుకున్నాడు. అయితే ఉద్యోగం ఇప్పించడంలో విఫలం కావడంతో తన డబ్బులు ఇవ్వాలని రెడ్డి నారాయణరావు పలుమార్లు అడిగినా మోహన్ ఇవ్వకుండా తప్పించుకున్నాడు. దీంతో బాధితుడు ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తప్పించాలి

- డీసీసీ అధ్యక్షుడు విద్యాసాగర్

విజయనగరం ఫోర్ట్: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తప్పించాలని డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం బాబా సాహెబ్ అంబేడ్కర్ సమ్మాన్ మార్చ్ చేపట్టి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్లు తిరుపతిరావు, రామచంద్రరాజు, చైతన్య, దుర్గాప్రసాద్, సత్యనారాయణ, రాష్ట్ర యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గోగాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బర్తరఫ్ చేయాలి

విజయనగరం అర్బన్: కేంద్ర మంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కలెక్టరేట్ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అమిత్ షా రాజ్యాంగ నిర్మాతనే హేళన చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో రాకోటి ఆనంద్, రెడ్డి శంకరరావు, పి.రమణమ్మ, జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.